ప్రచారంలో కీలకంగా సోషల్ మీడియా..!!

- సోషల్ మీడియాను నమ్ముకుంటున్న పార్టీలు
- అభ్యర్థుల వారీగా డెస్క్‌లు ఏర్పాటు
- సామాజిక మాధ్యమాలపై అవగాహన ఉన్నవారికి ఉద్యోగ అవకాశాలు
- సబ్‌స్క్రైబర్స్ అధికంగా ఉన్న యూట్యూబ్ పేజీలకు డిమాండ్

సిటీబ్యూరో, అక్టోబర్ 11 (నమస్తే తెలంగాణ): సోషల్ మీడియా.. ఇప్పుడు రాజకీయ పార్టీల ప్రచారంలో కీలకంగా మారింది. అభ్యర్థుల గెలుపోటములను శాసించే స్థాయికి ఎదిగింది. సమాచారం సెకన్లలో లక్షలాది మందిని చేరుతుండటంతో ఇప్పుడు పార్టీలన్నీ సామాజిక మాధ్యమాల వైపు చూస్తున్నాయి. ముఖ్యంగా ఆశావహులు ప్రత్యేకంగా వారి ప్రచారానికి సంబంధించి సోషల్ మీడియా డెస్క్‌లు ఏర్పాటు చేసుకొని... రోజువారీ ప్రచార వివరాలు, ప్రజలతో మమేకమయ్యే సందర్భాలను సోషల్ మీడియాలో అప్‌డేట్ చేయడానికి అవగాహన ఉన్న వారిని ఉద్యోగాల్లో చేర్చుకుంటున్నారు. అభ్యర్థికి పాజిటివ్ అంశాలను జత చేస్తూ సోషల్ మీడియాలో వీడియోలను రూపొందించి షేర్ చేయడానికి వీడియో ఎడిటర్లు, ప్రతిపక్షాల విమర్శలకు కౌంటర్లు, కంటెంట్ రైటర్లను నియమించుకుంటున్నారు. ఇప్పటికే అభ్యర్థులు ఫేస్‌బుక్, ఎక్స్(ట్విట్టర్), యూట్యూబ్, ఇన్‌స్టా, వాట్సాప్ చానెల్ ఇలా అనేక సామాజిక మాధ్యమాల వేదికగా ఎన్నికల ప్రచారానికి సిద్ధమవుతున్నారు. ఇప్పటికే కాంగ్రెస్, బీజేపీ ఎమ్మెల్యే టికెట్ ఆశావహులు సోషల్ మీడియాలో తమకు టికెట్ వస్తుందని మద్దతు ఇవ్వాలని పోస్టులు వైరల్ చేసుకుంటున్నారు.

అభ్యర్థులు తమకు మద్దతుగా ప్రచారం చేయాలని అత్యధికంగా ఫాలోవర్స్ ఉన్న పేజీ నిర్వాహకులను సంప్రదిస్తున్నారు. లక్ష సబ్‌స్క్రైబర్స్ ఉన్న యూట్యూబ్ పేజీకి ఓ ధర, ఆ పై ఉన్న పేజీలకు ఓ ధరను నిర్ణయిస్తూ వారి మద్దతు కూడగట్టుకుంటున్నారు. ఇప్పటికే వార్త కంటెంట్‌తో ఉన్న యూట్యూబ్ పేజీలకు మరింత డిమాండ్ పెరిగింది. అభ్యర్థి ప్రచారం నుంచి ఎన్నికలు పూర్తయ్యే వరకు కంటెంట్ సృష్టించి వీడియోలు ప్రసారం చేసి అభ్యర్థికి ఆదరణ వచ్చేలా యాక్టివిటీ అంతా సోషల్ మీడియా నిర్వాహకులే చూసుకుంటారు. మొత్తంగా ఎన్నికల ప్రచారం సోషల్ మీడియాలో కౌంటర్ ఎటాక్‌లతో జోరందుకోనుంది.

జిల్లాలో రిట్నరింగ్ అధికారులు వీరే

15 నియోజకవర్గాల్లో బాధ్యతలు అప్పగించిన ఎన్నికల అధికారి రోనాల్డ్ రాస్

సిటీబ్యూరో, అక్టోబర్ 11 (నమస్తే తెలంగాణ) : అసెంబ్లీ ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ చేసిన నేపథ్యంలో జిల్లాలోని 15 నియోజక వర్గాల్లో రిటర్నింగ్ అధికారులను జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్ నియమించారు. రిటర్నింగ్ అధికారిగా ఐఏఎస్ అధికారితో పాటు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, ఎస్టేట్ ఆఫీసర్లు, జోనల్ కమిషనర్లకు ఈ బాధ్యతలు అప్పగించారు.

నియోజకవర్గం	రిటర్నింగ్ ఆఫీసర్
ముషీరాబాద్	వి.లక్ష్మీనారాయణ
మలక్‌పేట	కె.వెంకట ఉపేందర్ రెడ్డి
అంబర్‌పేట	బి. అపర్ణ
ఖైరతాబాద్	ఐఏఎస్ వెంకటేశ్ దోత్రె
జూబ్లీహిల్స్	టి.రవి
సనత్‌నగర్	బి. కిషన్‌రావు
నాంపల్లి	వి.లావణ్య
కార్వాన్	కొమురయ్య
గోషామహల్	వి.విక్టర్
చార్మినార్	టి.వెంకన్న
చాంద్రాయణగుట్ట	ఎం.సూర్యప్రకాశ్
యాకత్‌పుర	ఇ.వెంకటచారి
బహదూర్‌పుర	ఆర్.దశరథ్ సింగ్
సికింద్రాబాద్	ఎల్లారెడ్డి
కంటోన్మెంట్	మధుకర్ నాయక్

ఎన్నికల మేనిఫెస్టోలో మాదిగల డిక్లరేషన్ ప్రకటించాలి

మషీరాబాద్, అక్టోబర్ 11: అన్ని రాజకీయ పార్టీలు తమ ఎన్నికల మేనిఫెస్టోలో మాదిగ డిక్లరేషన్ ప్రకటించాలని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ కోరారు. ఎస్సీ వర్గీకరణ చేస్తామంటూ కాంగ్రెస్, బీజేపీలు మాదిగలను మోసం చేశాయని, ఈ సారి ఎన్నికల్లో వర్గీకరణ అంశంపై కచ్చితమైన వైఖరి వెల్లడించాలని ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మాదిగలు, ఉప కులాలకు అన్ని రాజకీయ పార్టీలు జనాభా ప్రాతిపదికన 20 సీట్లు కేటాయించాలని కోరారు. రిజర్వుడ్ స్థానాలు 13తో పాటు జనరల్ స్థానాలు కేటాయించాలని కోరారు. అధికారంలోకి రాగానే వంద రోజుల్లో ఎస్సీ వర్గీకరణ చేస్తామన్న బీజేపీకి ఈ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతామని పేర్కొన్నారు.

వయసు రీత్యా వచ్చే రుగ్మతలపై సీసీఎంబీ అధ్యయనం

- కణాల జీవిత కాలంతో వచ్చే మార్పులను పరిశీలిస్తున్న పరిశోధకులు
- అధ్యయనంతో అల్జీమర్, కంటిచూపు లోపాలు, వినికిడి సమస్యలకు పరిష్కారం

సిటీబ్యూరో, అక్టోబర్ 11(నమస్తే తెలంగాణ) : వయసు రీత్యా వచ్చే రుగ్మతలపై సెంటర్ ఫర్ సెల్యూలార్ అండ్ మాలిక్యూలార్ బయాలజీ దృష్టి సారించింది. అల్జీమర్స్, కంటిచూపు లోపాలతోపాటు, వినికిడి, కీళ్ల నొప్పులు వంటి సమస్యలపై అధ్యయనం చేస్తున్నారు. శరీరంలో కొత్త కణాల పునర్జీవం, కణాల అభివృద్ధిలో వచ్చే సమస్యలను పరిశీలించనున్నారు. ఈ అధ్యయనం ద్వారా వృద్ధాప్యంలో వచ్చే వ్యాధుల నివారణ, శరీర జీవక్రియలను ప్రభావితం చేసే అంశాలను తెలుసుకునేందుకు వీలు ఉంటుందని సీసీఎంబీ వర్గాలు చెబుతున్నాయి. వృద్ధాప్యంలో ఎదురయ్యే శారీరక సమస్యలు, రుగ్మతలను అంచనా వేసేందుకు సీసీఎంబీ కణాల పనితీరు, జీవక్రియలను అధ్యయనం చేస్తోంది. ముఖ్యంగా జన్యువుల్లో ఉండే అతి ముఖ్యమైన ప్రోటీన్లను విశ్లేషించనున్నారు. 65ఏళ్లు దాటిన తర్వాత సర్వసాధారణంగా వచ్చే మతిమరుపు, పెర్కిన్‌సన్‌తోపాటు కంటిచూపు, వినికిడి వంటి సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని భావిస్తున్నారు. ప్రస్తుతం స్వస్తి రాయచౌదరి బృందం ప్రయోగశాలలో పెంచిన ఎలుకల మెదడులో కొత్త కణాలను ప్రవేశపెట్టి... నాడీ కణాల పనితీరును అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా నాడీకణంలోని జీవక్రియలు, వాటి శరీరంలో వచ్చే మార్పులను అధ్యయనం చేస్తుండగా, ఆధునిక సాంకేతికతను ఈ పరిశోధనకు వినియోగిస్తున్నట్లుగా తెలిసింది. ప్రయోగ ఫలితాలను బట్టి భవిష్యత్తులో వృద్ధాప్యంలో వచ్చే వ్యాధుల నియంత్రణకు అవసరమైన జీవక్రియ మార్పులు, చికిత్స విధానాలను రూపొందించడానికి వీలు పడుతుందని పేర్కొన్నారు.

ఎల్‌వీ ప్రసాద్ శాస్త్రవేత్తలకు విశిష్ట గౌరవం

జూబ్లీహిల్స్, అక్టోబర్ 11 : స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయం నిర్వహించిన ఒక అధ్యయనంలో ప్రపంచంలోని 2 శాతం అగ్రశ్రేణి పరిశోధకులలో ఎల్‌వీ ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థలోని 12 మంది శాస్త్రవేత్తలు చోటు సంపాదించి విశిష్ట గౌరవాన్ని దక్కించుకున్నారు. డాక్టర్ గుళ్లపల్లి ఎన్.రావు, ప్రొఫెసర్ డి.బాలసుబ్రమణియన్, డాక్టర్.సావిత్రి శర్మ, ప్రొఫెసర్ జిల్‌కిఫ్, డాక్టర్ ప్రశాంత్ గర్గ్, ప్రొఫెసర్, డాక్టర్ మొహమ్మద్ జావీద్ అలీ, డాక్టర్ అనిల్ కె.మండల్, డాక్టర్ స్వాతి కలికి, డాక్టర్ రోహిత్ ఖన్నా, డాక్టర్ తారా ప్రసాద్, డాక్టర్ సయన్ బసు, డాక్టర్ రాజ నారాయణ్ లతో పాటు పరిశోధన విభాగంలో డాక్టర్ శివాజీ సిసింతి మైక్రోబయాలజీ రంగంలో అగ్రశ్రేణి పరిశోధకులుగా గుర్తించబడ్డారు. నేత్ర సంరక్షణలో ఇప్పటివరకు 3.68 కోట్ల మందికి సేవలందించిన ఎల్వీ ప్రసాద్.. ఎస్సి ఇమాగో ఇనిస్టిట్యూషన్స్ రాంకింగ్స్-2023 లో ప్రపంచ వ్యాప్తంగా 8వ స్థానంలో నిలిచిందని ఎల్‌వీ ప్రసాద్ పరిశోధన అధిపతి డాక్టర్ సయన్ బసు పేర్కొన్నారు.

గెస్ట్ లెక్చరర్స్‌కు దరఖాస్తుల ఆహ్వానం

సిటీబ్యూరో, అక్టోబర్ 11 : విద్యానగర్‌లోని వివేకానంద డిగ్రీ కళాశాలలో గెస్ట్ లెక్చరర్స్ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జీ సుకన్య తెలిపారు. ఈ నెల 12న సాయంత్రం 5గంటల్లోపు ఆసక్తి ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అవర్లీ బేసిస్‌లో తీసుకోనున్నామని, 13న ఉదయం 11 గంటలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. బీఏ(ఎల్) తెలుగు పోస్టు కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని, అభ్యర్థులు పీజీలో కనీసం 55 శాతం మార్కులు వచ్చి ఉండాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 50 శాతం ఉండాలి. సంబంధిత సబ్జెక్ట్‌లో పీహెచ్‌డీ ఉన్న వారికి ప్రాధాన్యం ఉంటుందని, లేనివారికి నెట్, సెట్ అభ్యర్థులకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. బోధనా అనుభవం ఉన్న వారికి వెయిటేజీ ఉంటుందని, ఈ అభ్యర్థులు సర్వీస్ సర్టిఫికెట్‌ను సమర్పించాల్సి ఉంటుందన్నారు. అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో కళాశాలలో జరిగే ఇంటర్వ్యూకు హాజరు కావాలని ప్రిన్సిపాల్ డాక్టర్ సుకన్య కోరారు.

మహిళా ప్రత్యేక బస్సు సర్వీసులకు ఆదరణ

ఆర్టీసీ గ్రేటర్ జోన్ పరిధిలో కొనసాగుతున్న కొత్త సర్వీసుల ఏర్పాటు

సిటీబ్యూరో, అక్టోబర్ 11 (నమస్తే తెలంగాణ) : ఆర్టీసీ యాజమాన్యం గ్రేటర్ పరిధిలో మహిళా ప్రయాణికులకు అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నది. ముఖ్యంగా ఐటీ రంగంలో పని చేస్తున్న మహిళా ఉద్యోగులను దృష్టిలో పెట్టుకుని వారి భద్రతా దృష్ట్యా స్పెషల్ బస్సు సర్వీసులు ఏర్పాటు చేస్తున్నారు. సికింద్రాబాద్ నుంచి కూకట్‌పల్లి, బాచుపల్లి నుంచి వేవ్‌రాక్ వంటి పలు బస్ స్టాపుల మధ్య ఏర్పాటు చేసిన మహిళా ప్రత్యేక బస్సులకు మంచి ఆదరణ లభిస్తున్నది. కాగా భద్రత పరంగా కూడా ప్రత్యేక బస్సులు ప్రయాణికులకు అందుబాటులోకి వచ్చాయి. అయితే మహిళా ప్రయాణికుల కోసం ఉదయం, సాయంత్రం రెండు ట్రిప్పులు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. భవిష్యత్తులో కూడా ప్రయాణికుల రద్దీని బట్టి పలు ప్రాంతాల మధ్య ఉమెన్ స్పెషల్ బస్సులు ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

మానసిక ఆరోగ్యంపై అవగాహన సదస్సు

సిటీబ్యూరో, అక్టోబర్ 11 (నమస్తే తెలంగాణ) : నగరంలోని జాన్ పీటర్స్ మెమోరియల్ జూనియర్ కాలేజీలో తెలంగాణ సైకాలజిస్టు అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం-2023 పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ మేడ్చల్ డిస్ట్రిక్ట్ జనరల్ సెక్రటరీ రాజ్ ఆచార్య, ప్రెసిడెంట్ అలియా పర్విన్ పాల్గొన్నారు.

మేడ్చల్ జిల్లాలో రిటర్నింగ్ అధికారులు..

మేడ్చల్ కలెక్టరేట్, అక్టోబర్ 11 : మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో రిటర్నింగ్ అధికారులను నియమించినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అమోయ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. మేడ్చల్ నియోజకవర్గం(043) ఎస్.రాజేశ్ కుమార్ (ఆర్‌డీఓ - కీసర) ఫోన్ నంబర్ 79950 73744, మల్కాజిగిరి నియోజకవర్గం(044) ఎన్.రవికుమార్ (జోనల్ కమిషనర్, సికింద్రాబాద్) 91541 14996, కుత్బుల్లాపూర్ నియోజకవర్గం(045) సైదులు (ఎస్‌డీసీ-ఎల్ఎ) 79950 73736, కూకట్‌పల్లి నియోజకవర్గం (046) టి.శ్యాంప్రకాశ్ (ఆర్‌డీఓ - మల్కాజిగిరి) 79950 73753, ఉప్పల్ నియోజకవర్గం (047) అభిషేక్ అగస్త్య, 79950 73759(అదనపు కలెక్టర్-స్థానిక సంస్థలు)లను నియమించారు.

జిల్లా నోడల్ అధికారులు వీరే...

మ్యాన్‌పవర్ మేనేజ్‌మెంట్- విజయకుమారి(డీఈఓ), రామ్మోహన్‌రావు (అడ్మిన్ ఆఫీసర్), శిక్షణ నిర్వహణ -దేవసహాయం (సీఈఓ జడ్పీ), కేశరామ్(బీసీ సంక్షేమ అధికారి), మెటీరియల్ మేనేజ్‌మెంట్ - తనూజ (జిల్లా సప్లై అధికారి), రవాణా నిర్వహణ - కిషన్ (జిల్లా రవాణా అధికారి), కంప్యూటరైజేషన్, సైబర్ సెక్యూరిటీ, ఐటీ - సుహాసిని (జిల్లా ఇన్ఫర్మేటిక్ అధికారి), భానుప్రకాశ్ రెడ్డి (ఈ- మేనేజర్), స్వీప్ - పద్మజారాణి(డీఆర్‌డీఓ), అనిల్ కుమార్(పీడీ,మెప్మా), లా అండ్ ఆర్డర్, వీఎమ్ సెక్యూరిటీ ప్లాన్ - వినోద్ కుమార్ (ఎస్‌సీడీఓ), ఈవీఎం మేనేజ్‌మెంట్ డి.విజయేందర్ రెడ్డి(అదనపు కలెక్టర్ రెవెన్యూ), మోడల్ కోడ్ కండక్ట్ (ఎంసీసీ) కిష్టా రెడ్డి(WCD,S), రవీందర్(జీఎం, డీఐసీ), ఎక్స్‌పెండేచర్ మానిటరింగ్ (వ్యయ పర్యవేక్షణ) నర్సింహ (డీటీఓ), శ్రీనివాస్ రావు (డీసీఓ), బ్యాలెట్ పేపర్, పోస్టల్ బ్యాలెట్ (ఈటీపీబీఎస్) వంశీ మోహన్ (ఎస్‌డీసీ-యుఎల్‌సీ), మీడియా - కిరణ్‌కుమార్(డీపీఆర్‌ఓ), కమ్యూనికేషన్ ప్లాన్, మోహన్ రావు(సీపీఓ), ఎలక్టోరల్ రోల్స్- రమణమూర్తి(డీపీఓ), ఫిర్యాదుల పరిష్కారం - చంద్రావతి (లా అధికారి), పరిశీలకులు- రాజేందర్ (డీఎం, సివిల్ సప్లై)లను నియమించారు.

లిఫ్ట్ గుంతలో పడిన చిన్నారి

కాపాడిన పోలీసులు

జీడిమెట్ల, అక్టోబర్ 11: లిఫ్ట్ గుంతలో పడి అపస్మారక స్థితికి చేరుకున్న చిన్నారికి సీపీఆర్ చేసి జీడిమెట్ల పోలీసులు ప్రాణాలు కాపాడారు. వివరాల్లోకి వెళితే.. సూరారం డివిజన్ టీఎస్ఐఐసీ కాలనీలో ప్రభుత్వం ఆధ్వర్యంలో కమ్యూనిటీహాలు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. సోమవారం మధ్యాహ్నం స్థానికంగా ఉండే పురుషోత్తమ్ కుమారుడు నవదీప్(5) ఆడుకుంటూ లిఫ్ట్ కోసం తీసిన గోతిలో పడిపోయాడు. గుంతలో నీళ్లు ఉండటంతో అందులో మునిగిపోవడంతో స్థానికులు ఈ విషయాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న ఎస్ఐ ఆంజనేయులు, పోలీస్ సిబ్బంది బాలుడిని గుంత నుంచి వెలికి తీశారు. బాలుడు అపస్మారక స్థితికి చేరుకోవడంతో సీపీఆర్ చేసిన పోలీసులు తదనంతరం స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు రెండు గంటల పాటు బాలుడికి సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడారు. ప్రస్తుతం బాలుడు కోలుకుంటున్నాడని, ప్రాణాపాయం తప్పిందని వైద్యులు పేర్కొన్నారు. పోలీసుల సమయస్ఫూర్తిని స్థానికులు మెచ్చుకుంటున్నారు.